# మినీ కథలు :

## చిల్లర



కమలాకరంప్రసాద్

ఒకసారి నేను. మా ఫ్రెండ్ రంగా కలిసి "వెల్‌కం" హోటల్లో తీరిగ్గా పీకలదాకా మెక్కిన తరువాత కాసేపు బిల్లు నేనిస్తానంటె. నేనిస్తానని పోట్లాడుకున్నాక. చివరికి నేనే గెలిచినట్లు నా మిత్రుడు డిక్లేర్ చేసి ప్రక్కకి తప్పుకున్నాడు. నేను గొణుక్కుంటూ జేబులోంచి ఒక రెండు రూపాయలనోటు. మరొక రూపాయినోటు తీసి రెండూయాభై పైసల బిల్లుతో కలిపి కౌంటరులోని వ్యక్తికి అందించాను. అతను ఓసారి క్యాష్ బాక్సులోకి తొంగి చూసి చిల్లర లేదు. యాభై పైసలు తరువాత తీసుకోండి అన్నాడు. అదేదో ఆ హోటలు ఆచారమైనట్లు.

ఈనాడు ఇదో పెద్ద న్యూసెన్సు. ఎక్కడ చూసినా చిల్లర తిరిగి ఇవ్వటం లేదు. బస్సులో కండక్టరు టిక్కెట్టు ఇచ్చి. చిల్లర దిగేటప్పుడు తీసుకోమంటాడు సినిమాహాల్లో బుకింగ్ క్లర్కులు చిల్లర లేదు సినిమా వదిలాక కనబడండి అంటారు. అంతెందుకు పదిహేను పైసల న్యూస్ పేపరుకి చిల్లర లేదని ఇరవై పైసలు వసూలు చేస్తున్నారు. మనం అవసరం కొద్దీ పోనీలెమ్మని ఊరుకుంటాం కాని ఇది వారు లాభసాటి వ్యాపారంగా సాగించేస్తున్నారు. మేము చాలాసార్లు చిన్న చిన్న చిల్లర్లు వదులుకున్నాము.

కాని ఈ సారి మా రంగకి భలే కోపం వచ్చేసింది దాంతో దూకుడుగా కౌంటరులోని వ్యక్తి దగ్గరికి వచ్చి ఆ యాభై పైసలు ఈ సారి మేమే ఇస్తాం కాని, ఆ రూపాయి ఇటివ్వండి అనేసరికి. పాపం! ఆ వ్యక్తి ఆముదం త్రాగిన మొహం పెట్టి ఒక రూపాయి తీసి నాకిచ్చాడు.

తరువాత రెండు రోజులకు అనుకుంటాను. మరో మిత్రుడితో కలసి అదే హోటల్‌కి వెళ్ళాను. ఈ సారికూడా బిల్లు చెల్లించే సదవకాశం నాకే వచ్చింది బిల్లు చెల్లిస్తుండగా. పాతబాకీ గుర్తుకువచ్చి అడిగి ఇవ్వటం మంచిదని ఏమండీ "మా ఫ్రెండ్ చిల్లర ఇచ్చివెళ్ళాడా" అన్నాను.

"అతను ఏమోనండి జ్ఞాపకంలేదు" అన్నాడు సరే అని అనుమానంగానే పాత చిల్లర కూడా చెల్లించి. ఇంటికి వస్తుండగా బజారులో మా రంగడు కలిశాడు. వాడు మళ్ళీ ఇస్తాడేమోనని చిల్లర ఇచ్చిన సంగతి చెప్పాను.

"నేను మొన్ననే ఇచ్చేశానుగా. మళ్ళీ నీ దగ్గర ఎందుకు తీసుకున్నాడు" అని ఎదురు ప్రశ్న వేశాడు. "సరేలే! నువ్విచ్చినట్లు నేను కలగన్నానా!" పోనీ తరువాత తిరిగి తీసుకోవచ్చు అని ఆ సంభాషణ అంతటితో ఆపి మా శ్రీమతి చెప్పిన కూరగాయలు కొని ఇల్లుచేరాను.

ఇంటి దగ్గర మా శ్రీమతి చేతిమీదుగా. ఎన్ని కప్పుల కాఫీ సేవించినా హోటలుకి వెళ్ళకుండా నా మనసు నిలవదు. అలాగే మరోసారి అదే హోటలుకి వెళ్ళినపుడు. ఇద్దరి దగ్గరా వసూలు చేశాడన్న కోపంతో దబాయించి అతని దగ్గర మా యాభై పైసలు వసూలు చేశాను.

అటు తర్వాత రెండు రోజులకి అనుకుంటాను; మా రంగ నన్ను చూడగానే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు "అరే! ఆ హోటలతని దగ్గర మన అర్ధరూపాయి తీసేసుకున్నాను" అన్నాడు.

నేను నోట మాట రాక తెల్లబోయి వింటుండిపోయాను! ★

## ఏస్ ఆసర్



పిచ్చి పరంధామయ్యంటే ఆ పేటలో తెలియని వారుండరు "పిచ్చి" అంటే యింటిపేరేమో ననుకునేరు. అది పరంధామయ్యగారి శక్తి సామర్థ్యాలను చూసి. ఆ పేటవాళ్ళంతా ఆలోచించి. ఆలోచించి చించి. బుర్రలు బద్దలు కొట్టుకుని. చివరకు ఏకగ్రీవంగా నిర్ణయించిన పేరది.

పరంధామయ్య అసలు పూర్తి పేరు "పెద్దపులి పరంధామయ్య." పేరులోనయితే "పులి" వుందికాని. మనిషిలో మైక్రోస్కోపు పెట్టి వెతికినా. కనీసం పులిగోళ్ళ ఛాయ

మునీర్

లన్నా కనిపించవు. పుట్టటమే భయపడుతూ. భయపడుతూ పుట్టాడు. భయపడుతూ చదివాడు. భయపడుతూనే పెరిగి పెద్దై పెళ్ళి చేసుకుని భయపడుతూనే పదిమంది పిల్లల్ని కనేశాడు. భయపడుతూనే తాసిల్దారుగా పన్జేసి. భయపడుతూనే రిటైరై పోయాడు యేడాది క్రిందట.